నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | ఫిబ్రవరి 09, 2025 | www.navatelangana.com

కేజీబీవీలో భేటీ బచావో భేటీ పడావో

నవతెలంగాణ-బోధన్



అవగాహన పత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు

మండలంలోని అమ్దాపూర్ కేజీబీవీ పాఠశాలలో శనివారం మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బోధన్ ప్రాజెక్ట్ వారితో పాఠశాల విద్యార్థినిలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, ప్రిన్సిపాల్ హిమబిందు, సోషల్ వర్కర్ సాయిలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత పశువైద్య శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మాజివాడి గ్రామంలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ, పశువైద్యశాల సదాశివనగర్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. రైతులందరూ ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆవులు, గేదెలు ఏవైనా కట్టనిచో వాటిని పరీక్షించి గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్స అందించారు. లింగ నిర్ధారిత వీర్యంపై అవగాహన కల్పించారు. ఈ లింగ నిర్ధారిత వీర్యం వాడడం వలన 90శాతం ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని తెలిపారు. దీనికిగానూ రైతు వాటా రూ.250 చెల్లించాలని తెలిపారు. ఒకే పశువుకు వరుసగా రెండు ఎదలలో లింగ నిర్ధారిత వీర్యం వాడి నా.. చూలు కట్టకపోతే రైతు వాటా రూ.500 రైతు అకౌంట్‌కు వాపస్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిబిరంలో దాదాపు 37 గేదెలు, 24 ఆవులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ కృష్ణ, విజయ పాల కేంద్రం అధ్యక్షులు గంగాధర్‌రావు, పశుగణన సహాయకులు పి.అహల్య, డి.జుగల్ కిషోర్, గోపాలమిత్రలు కాశిరెడ్డి, మురళి, ఇస్మాయిల్, సాయి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి అధికారిపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

- రైతులను అవహేళన చేసిన వారిపై చర్యలు
- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-నసురుల్లాబాద్

విధి నిర్వహణలో అలసత్వం, రైతులను అవహేళన చేసిన బీర్కూర్ మండలం సాగునీటి అధికారిపై శాఖపరమైన తగుచర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఆదేశించినట్లు బాన్సువాడ డివిజన్ సాగునీటి శాఖ ఉన్నతాధికారి తెలిపారు. శనివారం నవతెలంగాణ పత్రికలో ఎండుతున్న పంటలు అనే శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి స్పందిస్తూ.. విధుల పట్ల నిర్లక్ష్యం, రైతులను అవహేళన చేసిన బీర్కూర్ మండల సాగునీటి అధికారి గజానంద్‌పై శాఖపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలంటూ సాగునీటి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు బాన్సువాడ డివిజన్ సాగునీటి ఉన్నత అధికారి తెలిపారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందక వరి పంటలు ఎండుతున్నాయంటూ గత నాలుగు రోజులుగా దామరంచ, కిష్టాపూర్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దామరంచ శివారులోని నిజాంసాగర్ 25 ఉప కాల్వ కింద ఉన్న పొలాలకు సాగునీరందక సుమారుగా 100 ఎకరాల వరకు పంట పొలాలు బీటలు బారుతున్నాయని రైతులు పేర్కొన్నారు. పొలాలు బీటలు బారి వరిపైరు ఎండుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందేలా చూడాలని కోరడంతో బీర్కూరు మండలం సాగునీటి అధికారి గజానంద్ రైతులందరూ ఇంట్లో నిద్రపోతే పంట పొలాలకు నీరెలా వస్తుందని రైతు కష్టాన్ని అవహేళన చేయడంతో రైతులు ఆవేదన చెంది సాగునీటి ఉన్నతాధికారి రాజశేఖర్‌కు విషయం తెలియపరిచారు. తాను స్థానికంగా లేదని రాగానే సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు. శుక్రవారం రాత్రి నుండి చివరి ఆయకట్టుకు ఇప్పుడు ఇప్పుడే సాగునీరు వస్తుందని చివరి ఆయకట్టుకు సాగునీరు రావడం కొంత ఆలస్యం అవుతుందని బాన్సువాడ డిప్యూటీ ఇంజనీర్ జగదీష్ తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.



నవతెలంగాణలో శనివారం ప్రచురితమైన కథనం

మూడు కోట్లకు టోకరా

అప్పులు తీసుకుని పరారైన మెగామార్ట్ సూపర్ మార్కెట్ యజమాని

- లబోదిబోమంటున్న హోల్‌సేల్, అప్పులిచ్చిన బాధితులు
- రెండు నెలలుగా తాళం వేసి ఉన్న సూపర్ మార్కెట్
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్
- ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఏరియాలో గల మెగా మార్ట్ సూపర్ మార్కెట్, డిపార్ట్మెంటల్ స్టోర్ యజమాని మహమ్మద్ అబ్దుల్ హబీబ్ సుమారు వివిధ రూపాలలో మూడు కోట్ల వరకు కామారెడ్డి వాసులకు బాకీ పెట్టి కామారెడ్డి నుంచి పరారైనట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఈ హబీబ్ అనే వ్యక్తి ఇతర ప్రాంతం నుంచి ఇక్కడికి వ్యాపార నిమిత్తం వచ్చి గతంలో ఇతర సూపర్ మార్కెట్లో విధులు నిర్వహించిన హబీబ్ గత రెండు మూడు సంవత్సరాల క్రితం సొంతంగా మెగామార్ట్ సూపర్ మార్కెట్‌ను నెలకొల్పి కొనసాగించాడు. దీంతో హోల్సేల్ వ్యాపారులు అతనికి బియ్యం నుంచి మొదలుకొని టూత్ బ్రష్‌ల వరకు లక్షల్లో ఉద్దెర ఇస్తూ వెళ్లారు. వీరితోపాటు మరికొందరు ఇతర దుకాణంలో ఇతను పనిచేస్తున్న సమయంలో పరిచయమైన వ్యక్తులు, వారి స్నేహితులు ఇతనికి రెండు రూపాయల మిత్తి అనుకొని రూ.50 వేల నుంచి లక్ష వరకు అప్పులిచ్చి నెలనెలా ఇంట్రెస్ట్ ఇచ్చేటట్లు ఒప్పందపత్రం రాసుకొని నెలనెలా మిత్తి తీసుకుంటూ వెళ్లారు. గత రెండు నెలల క్రితం సూపర్ మార్కెట్‌కు తాళం వేసి ఉండడంతో 'ఈరోజు వస్తాడు, రేపు వస్తాడు..' అంటూ చూసి విసిగిపోయిన వీరు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శనివారం వస్తాడని మెగా మార్ట్ ముందు కామారెడ్డి పట్టణంలోని పలువురు మిత్తిలకు ఇచ్చిన వ్యక్తులు, హోల్‌సేల్ దుకాణాల యజమానులు మెగా మార్ట్ సూపర్ మార్కెట్ వద్ద గుమిగూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటివరకు హోల్‌సేల్ యజమానులు, మిత్తిలకు ఇచ్చిన వారు కానీ ఈ విషయాన్ని ఎవరికీ తెలుపలేదు. ప్రభుత్వం కలగజేసుకొని ఆ వ్యక్తిని పట్టుకొని ఆ వ్యక్తి వద్ద నుంచి తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించాలని ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకుంటే..

హోల్సేల్ వ్యాపారులను, కొందరు అమాయకులను మోసం చేసిన ఈ వ్యక్తిని పట్టుకొని వీరికి డబ్బులు ఇప్పించాలని ప్రభుత్వ అధికారులు అనుకుంటే వారి డబ్బులు వారికి వచ్చే అవకాశం ఉంటుందని కామారెడ్డి పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.



మెగామార్ట్ సూపర్‌మార్కెట్

కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు


వర్మికంపోస్టు తయారీని తెలుసుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ విజిట్లో భాగంగా రుద్రూర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం సందర్శించారు. అక్కడ శ్రీకాంత్ విద్యార్థులకు హార్టికల్చర్‌లో నూతన సాగు పద్ధతులు, ఆర్గానిక్ వ్యవసాయానికి సంబంధించిన అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై సైతం అవగాహన కల్పించారు. అక్కడి నుంచి అక్బర్‌నగర్‌లోని ప్రకృతి చికిత్స ఆలయాన్ని సందర్శించారు. విద్యార్థులు మంచి ఆహార పద్ధతులు ఆరోగ్య సూత్రాల గురించి తెలుసుకున్నారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగానే కొంతమంది విద్యార్థులు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. రాష్ట్రపతి సంవత్సరంలో ఒకసారి 10 నుంచి 15 రోజుల పాటు ఇక్కడ విడిది చేసి దక్షిణాది రాష్ట్రాల ప్రజల సమస్యలను తెలుసుకోవటానికి ఇక్కడికి వస్తారని విద్యార్థులు తెలుసుకున్నారు. వీటితోపాటు మరెన్నో విషయాలను విద్యార్థులు అవగాహన చేసుకున్నారు. ఈ ఫీల్డ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని, వారు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా అవగాహన పొందడానికి ఈ ఫీల్డ్ ట్రిప్ ఉపయోగపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం శంకరంపేట్ శ్రీరామ గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మైదపు భూమయ్య బాలికల సాధికారత కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఆర్థిక క్రమశిక్షణ, బాలికల పొదుపుపై వివరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా గుర్తించబడిన 40 ఆర్థిక మోసాల నుంచి ఎలా తప్పుకోవాలో అనే విషయంలో అవగాహన కల్పిం చారు. అనంతరం ఎంఈవో రాజీ మంజూషా మాట్లాడుతూ.. విద్యార్థులకు మోసపూరిత ఫోన్ కాల్స్‌కు భయపడకుండా మన వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకుండా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు విజయ్ కుమార్, విజయలక్ష్మి, శోభారాణి, అరుణ్ కుమార్, విట్టల్ కాంబ్లే, లక్ష్మి, అంజన, వనజా, సాయిలు విద్యార్థులు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి

- సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు


మాట్లాడుతున్న కొత్త నరసింహులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజాసంఘాల మహా ధర్నాను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు అన్నారు. శనివారం రాజంపేట్ మండల కేంద్రంలో పోడు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడా బాబుల బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలు చేయాలని ప్రతి వ్యవసాయ కార్మికునికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. పోడు రైతులకు పక్కా పత్రాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలిచ్చి ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణకు ద్రోహం.. బడా బాబులకు భోజ్యం

- కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల మహాధర్నాను జయప్రదం చేద్దాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల మహాధర్నాను జయప్రదం చేద్దామని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేష్ మాట్లాడుతూ.. 2025 ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటలకు ఇందిరాపార్కు, హైదరాబాద్ మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను చట్టబద్ధం చేసే ఎంఎస్పి చట్టం తెచ్చేది లేదని, అందుకవసరమైన నిధులు కేటాయించబోమని ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ స్పష్టం చేసిందన్నారు. రైతన్నలను మార్కెట్ శక్తుల దోపిడీకి వదిలేసింది. ఎరువుల సబ్సిడీలో కోత పెట్టి ధరల పెరుగుదలకు కారణమయింది. రైతుల ఆత్మహత్యలను నివారించడానికి రుణ విమోచన చట్టం ప్రకటించలేదు. రుణమాఫీ మాటే ఎత్తలేదు. రెండు లక్షల కోట్లు కేటాయించాల్సిన గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేవలం 86వేల కోట్లు కేటాయించింది. ఇవి సరిపోవు. రెండు లక్షల కోట్లు కేటాయించాలి. భారతీయ బీమా రంగంలో 100శాతం ఎఫ్ఐ ప్రకటించి విదేశీ కార్పొరేట్ల చేతుల్లోకి పెట్టేందుకు సిద్ధమైంది. దేశ ప్రజల పొదుపును స్వాహా చేసేందుకు విదేశీ కంపెనీలకు అప్పగించడం దేశభక్తి కాదు విదేశీ భక్తి. విద్యుత్తు రంగాన్ని కూడా ప్రైవేటీకరించాలని ప్రతిపాదించారు. ఈ చర్యలు దేశ అభివృద్ధికి ఆటంకమే కాకుండా సాధారణ ప్రజల జీవితాల మీద మోయలేని భారంగా తయారవుతాయి. కార్మికుల కనీస వేతనాల పెంపుదలకు గానీ, ఇతర శ్రామిక ప్రజల ఆదాయాల మెరుగుదలకు గానీ ఈ బడ్జెట్లో ఎటువంటి ప్రతిపాదనలు లేవు.' అని తెలిపారు. పైగా యాజమాన్యాల కోసం తెచ్చిన లేబర్ కోడ్‌లను అమలు జరపాలని, సరళీకృత విధానాల అమలు మరింత వేగవంతం చేయాలని బడ్జెట్లో ప్రతిపాదించారని పేర్కొ న్నారు. 12 గంటల పని విధానంపై ఇటీవల కార్పొరేట్లు పదేపదే మాట్లాడు తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలందించే ఆశాల ప్రసక్తి లేదన్నారు. పెరుగు తున్న ధరలు, అవసరాలకనుగు ణంగా ఐసిడిఎస్‌కు కేటాయింపులు లేవని తెలిపారు. స్కీమ్ వర్కర్ల క్రమబద్ధీకరణ గురించి గానీ, 40 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలు బడ్జెట్లో లేవని తెలిపారు. 16 శాతం జనాభా ఉన్న ఎస్సీలకు కేవలం 5శాతం, 15 శాతంగా ఉన్న మైనారిటీల సంక్షేమానికి కేవలం 0.05 మాత్రమే బడ్జెట్లో నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నదన్నారు. హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఎస్‌పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నన్నేసాబ్, విజయ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పంచాయతీ కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలి

- తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని గ్రామపంచాయతీలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వకుండా అధికారులు పనులు చేయించడం చట్ట విరుద్ధమని, అలాంటి అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం వర్ని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల విస్తృతస్థాయి సమావేశం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి అధికారులు పనులు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్‌లు, బూట్లు, చెప్పులు, గ్లౌజులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని కోరారు. లేకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు నన్నేసాబ్, యూనియన్ నాయకులు సాయిలు, రాజు, లింగం, మారయ్య, సాయమ్మ, రేఖ, సాయి చరణ్, శిరోమణి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పీఓలు, ఏపీఓలకు శిక్షణ తరగతులు



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎలాంటి సందేహాలున్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలకు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో శనివారం మొదటి విడత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలున్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్నవారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26వ తేదీన ఉదయం 8గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్‌లిస్ట్‌లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడినదా లేదా అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామగ్రిని పరిశీలించుకున్న మీదట తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల లోనికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీ.ఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పి.ఓలదేనని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పి.ఓలు, ఏ.పీ.ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్లు హన్మాండ్లు, వర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల్లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లు, పీ.ఓలు, ఏ.పీ.ఓలు, ఓ.పీ.ఓలు పాల్గొన్నారు.


హాజరైన అధికారులు

అవినీతి పార్టీని ఓడించి బుద్ధి చెప్పారు

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

ఢిల్లీలో గెలుపుతో మోడీ హవా తెలిసిందని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఢిల్లీలో విజయం సాధించిన బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి పార్టీని ఓడించి బుద్ధి చెప్పారని, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవని పరిస్థితిలో ఉందని అన్నారు. ఎంపీ అరవింద్ ప్రచారం చేసిన స్థానాల్లో బీజేపీ అఖండ విజయం సాధించిందని, ఇదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటు బ్యాంకు రాజకీయాలు చేసిన ఆప్, కాంగ్రెస్ పార్టీలు

నవతెలంగాణ-ఆర్మూర్



ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆప్, కాంగ్రెస్ పార్టీలు చేశాయని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజరీ కమిటీ మెంబర్ గుగులోత్ తిరుపతి నాయక్ శనివారం తెలిపారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం వెనుక ముస్లిం మహిళల ఓటు బ్యాంకు ఉందని, ముస్లిం మత పెద్దలు కూడా భారతీయ జనతా పార్టీ వైపే ఓటు వేశారని పేర్కొన్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ న్యాయం పరిపాలన అందిస్తుందని, ఈ 11 సంవత్సరాలుగా పరిపాలన వలన నమ్మకం కుదిరిందని తెలిపారు. సబ్‌కాసాత్, సబ్‌కావిశ్వాస్, సబ్కా వికాస్ నమ్మకం కలిగించింది అని పేర్కొన్నారు.

స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- బడ్జెట్లో టీయూకు రూ.500కోట్లు నిధులు కేటాయించాలి
- ఇంజనీరింగ్ విద్యకు శ్రీకారం చుట్టాలి : ఎస్ఎఫ్ఐ
- టీయూలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బడ్జెట్లో తెలంగాణా యూనివర్సిటీకి 500 కోట్ల నిధులను కేటాయించి ఇంజనీరింగ్ విద్యకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ దిష్టిబొమ్మను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఇప్పటికీ పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ ఊసే ఎత్తకపోవడం దారుణమని అన్నారు. స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు బిక్షం ఎత్తుకుంటున్న పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశాలలో తెలంగాణ యూనివర్సిటీకి కనీసం 500 వందల కోట్ల రూపాయలు కేటాయించి వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ విద్యకు శ్రీకారం చుట్టాలని, లేకపోతే భవిష్యత్తులో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఇల్లు ముట్టడికి వెనకాడబోమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజకుమార్, యూనివర్సిటీ అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు పృథ్వి, సంతోష్, నిరంజన్, నాగేంద్ర, స్వామి, జీషన్, చరణ్, సాగర్, చక్రి ,వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్‌వాయి ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా నీరడి గంగాధర్ ఎన్నిక


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నీరడి గంగాధర్-ఆంధ్రజ్యోతి, గౌరవ అధ్యక్షులుగా సయ్యద్ నయీమ్-నవతెలంగాణ, ప్రధాన కార్యదర్శిగా పూజ్యం రవికుమార్-ఆంధ్రప్రభ, ఉపాధ్యక్షులుగా శ్రీపతి జితేందర్-మన తెలంగాణ, సంయుక్త కార్యదర్శిగా పాశం నర్సయ్య-చట్టం, కోశాధికారిగా రాకేష్-వెలుగు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జెగ్గ రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు నీరడి గంగాధర్ మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల కోసం ముందుండి పోరాడతానని, అందరికీ న్యాయం జరిగేలా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యవర్గ సభ్యుల సహాయ సహకారంతో కృషి చేస్తానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రింట్ మీడియా మండల పాత్రికేయులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఫిబ్రవరి 10న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలో శనివారం విలేకరుల సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, నాయకులు సదమస్తుల అశోక్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కం సుజాత పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులకు కార్మికులకు వ్యవసాయ కూలీలకు ఏ మాత్రం ప్రయోజనం లేని బడ్జెట్ తప్ప ఆదా నీ అంబానీలకు ఆర్ఎస్ఎస్ తయారుచేసిన బడ్జెట్లో ఉంది అని అన్నారు .బడ్జెట్లో మార్పులు చేసి పేదలకు రైతులకు వ్యవసాయ కూలీలకు కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఈనెల 10న హైదరాబాద్ ఇందిరాపారేట్లో వేలాది మందితో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు తెలంగాణకు మొండి చేయి చూపించింది పసుపు బోర్డ్ నిధులే ఏమి కేటాయించిన పరిస్థితి లేదు కార్మికులకు వేతనాలు పెంచాలని గాను ఏమీలేదు పెట్టు బడి దారులకు రాయితీలు ఈస్తు ప్రజలపై భారాలు వేసి ప్రజల నడ్డి విడిచే విధంగా ఉందని అన్నారు .ముఖ్యంగా విద్య వైద్యం కేటాయింపులు అం తనతే రైతులకు ఎరువులు విత్తనాలు కు సబ్సిడి లేవు అని అన్నారు. ఈనెల 10న హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు . రైతులు విద్యార్థులు మేధావులు కార్మికుల పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

తడి, పొడిచెత్త వేరుచేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న మున్సిపాల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్

మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెర్కిట్ ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం విద్యార్థులకు చెత్త నిర్వాహణ, కుక్క కాటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ మున్సిపల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త ఏ విధంగా నిర్వహణ చేయాలో, కుక్కలతో ఎలా వ్యవహరించాలో, వాటి జనాభా నియంత్రణకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఇచ్చిన సూచనలు పాటిస్తూ తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆపార్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి...

కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఆపార్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పెర్కిట్ పాఠశాల కాంప్లెక్స్ ప్రాథమిక ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో పెర్కిట్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం యూడీసీలో లోపాలు లేకుండా పూరించాలని అన్నార. డిసిఎఫ్‌ఫామ్ గరించి క్షుణ్ణంగా వివరించారు. కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు ఆఫర్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలల పని వేళలు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వర్ని

25క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసిపి నాగేంద్ర చారి శనివారం తెలిపారు. ఏసీపీ ఆర్యంలో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య సిసిఎస్ సిబ్బంది వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని, మోస్రా గ్రామంలో పిడిఎస్ రైస్ 25 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని తదుపరి చర్య నిమిత్తం వర్ని పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ కు అప్పగించినట్లు తెలిపారు.

10న జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకొని జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ఈనెల 10న జిల్లా కేంద్రంలోని మాణిక్ భవన్ స్కూల్ నిజామాబాద్‌లో 11 గంటలకు నిర్వహించనున్నట్ల ఎస్పి ఎస్టి జిల్లా అధ్యక్షులు గుజ్జ శివ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పసుపుల రఘునాథ్ లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ మండలాల్లో సెలెక్ట్ అయిన మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి టెస్టుకు తీసుకురావాలని పేర్కొన్నారు.

న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్ ముప్కాల్‌కు చెందిన న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయికి ఎంపిక అయిందని పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 3న నిర్వహించిన పరీక్షల్లో పాఠశాల నుండి 21 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపుతూ జాతీయ స్థాయి ఒలంపియాడ్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రత్నాకర్, అధ్యాపక బృందం శైలజ, రుచిత, వినీల తదితరులు పాల్గొన్నారు..

చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలి

- నలంద పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సంబరాలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

నవతెలంగాణ-ఆర్మూర్

చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాల యాజమాన్యం అన్నారు. పదవ తరగతి 2024-2025 విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు శుక్రవారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ ప్రసాద్ పూజ కార్యక్రమం చేశారు. ప్రిన్సిపాల్ సాగర్ జ్యోతిప్రజ్వలన చెసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల ప్రగతిని తెలుపుతూ మున్ముందు ఎలా ముందుకు వెళ్లాలో తెలిపారు. 10 జిపిఏ పైన దృష్టిలో ఉంచుకొని స్కూల్‌కు పేరు తెచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ తో ఉంటూ చదువుపైన దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నార. సమాజంలో జరిగే మార్పులకు అనుగుణంగా విద్యార్థులు స్మార్ట్ వర్క్ చేయాలని చాలా చక్కని ఉదాహరణ లతో వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతోగల బంధం గుర్తు చేసుకున్నారు విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయలతో వారి అనుభవాలను, పాఠశాలతోగల బంధం ను గుర్తు చేసుకొని బాధపడ్డారు. విద్యార్థిని విద్యార్థుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంఈఎస్ ప్రొబెషనరీ అధికారుల అధ్యయనం


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తమ శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో వివిధ అంశాల అధ్యయనం కోసం నిజామాబాద్‌కు వచ్చిన మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రొబెషనరీ అధికారుల బృందం పర్యటన శనివారం ముగిసింది. 30 మందితో కూడిన అధికారులను ఆరు బృందాలుగా విభజిస్తూ, ఒక్కో బృందానికి ఒక గ్రామం చొప్పున క్షేత్రస్థాయి అధ్యయనం చేయించారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, సుంకెట్, దొన్కల్, నందిపేట మండలంలోని సిద్దాపూర్, వన్నెల్(కె), వెల్మల్ గ్రామాలతోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రొబేషనరీ అధికారులతో కూడిన బృందాలు ఎనిమిది రోజులపాటు వివిధ వర్గాల వారిని కలిసి వారి పనితీరును, ఆయా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. క్షేత్రస్థాయి అధ్యయనాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రైనీ అధికారులు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌ను కలిశారు. క్షేత్రస్థాయిలో తాము గమనించిన అంశాలను వారి దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరు, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కూలీలు తదితరుల పనితీరును క్షేత్రస్థాయి సందర్శనలో పరిశీలించిన అంశాలను తెలియజేశారు. క్షేత్రస్థాయి అధ్యయనానికి హాజరైన తమకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా తోడ్పాటును అందించిందని కృతజ్ఞతలు తెలుపుతూ వీడ్కోలు తీసుకున్నారు. ట్రైనీ అధికారులకు డీఆర్డీఓ సాయాగౌడ్, విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు వీడ్కోలు పలికారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన కూశ లక్ష్మీ (56) వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కును పంపిణీ చేశారు. చెక్కు మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, నాయకులు పన్నాల నర్సారెడ్డి, సాగర్, గంగాధర్, స్వామి, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ విజయం స్ఫూర్తిదాయకం..

- అధ్యక్షులు లోలం సత్యనారాయణ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయ దుందుభి మోగించడం స్ఫూర్తిదాయకమని బిజెపి ఇందల్‌వాయి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ పేర్కొన్నారు. ఢిల్లీలో విజయం సాధించడంతో మండలకేంద్రంలో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై విశ్వాసంతో 27 ఏళ్ళ తర్వత ఢిల్లీ ప్రజలు కనివిని ఎరుగని రీతిలో తీర్పునిచ్చరని వివరించారు. బిజెపి ప్రజల నమ్మకాన్ని విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ఉంటుందని అశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు నాయిడి రాజన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి పరీక్షా కేంద్రంలో జియో ట్యాగింగ్ చేయాలి

- జిల్లా ఇంటర్ విద్య అధికారి
- ప్రయోగ పరీక్ష కేంద్రాలు పరిశీలన


ప్రయోగ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంటర్ విద్యాధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో రెండవ స్పెల్ ప్రయోగ పరీక్షలు శనివారం నుండి ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తెలిపారు. శనివారం బోధన్ పట్టణంలోని ప్రయోగ పరీక్షలు జరుగుతున్న విజేత జూనియర్ కళాశాల, ఉషోదయ జూనియర్ కళాశాల,విద్య వికాస్ జూనియర్ కళాశాల బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎడపల్లి మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలను ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దిన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో మరో 15 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్య అధికారి పరిశీలించి సమీక్షించారు. ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి పరీక్షా కేంద్రంలో జియో ట్యాగింగ్ చేయాలని, కెమరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బాగా చదివే విద్యార్థులకు అన్యాయం జరగవద్దనే ఉద్దేశంతో కెమెరాల ద్వారా హైదరాబాద్ నుండి కమిషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.

విధుల్లోకి మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు


వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. మగ్గిడి ఉన్నత పాఠశాలలో నవంబర్ నెలలో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని చర్చలు నిర్వహించినట్ల సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు పల్లపు వెంకటేష్ తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. దీంతో తిరిగి సోమవారం నుండి వంట చేస్తారని చెప్పారు. అధికారులు స్పందించి పరిష్కారం కోసం కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ హరిత, సిఐటియు మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య, మధ్యాహ్న భోజన మండల కార్యదర్శి జక్కం సుజాత, అశోక్, హసీనా తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరి క్షేత్రంపై సిమెంటు రోడ్డు, ఫ్లోరింగ్ పనులు


కొనసాగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీగిరి క్షేతంపై శనివారం సిమెంటు రోడ్డు పనులను ప్రారంభమయ్యాయి. స్థానిక తాజా మాజీ సర్పంచ్ గడ్డం స్వామి తన సొంత ఖర్చుతో గుట్టపై సిమెంట్ రోడ్డు పనులను చేపట్టారు. శ్రీగిరి క్షేతంపై ఉన్న బ్రహ్మంగారి గుడి, సరస్వతి ఆలయం, శివాలయం చుట్టూ భక్తుల సౌకర్యార్థం సొంత ఖర్చుతో గడ్డం స్వామి సిమెంటు రోడ్లతో పాటు ఫ్లోరింగ్ పనులను చేయిస్తున్నారు. ఈనెల 12 పౌర్ణమి రోజున జరగనున్న బ్రహ్మంగారి జాతర, అన్నవితరణ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని గుట్ట పైకి వచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో మాజీ సర్పంచ్ గడ్డం స్వామి సిమెంటు రోడ్ల, ఫ్లోరింగ్ పనులు చేయిస్తున్నారు. శ్రీగిరి క్షేతంపై సిమెంటు పనులతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్న గడ్డం స్వామికి స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పేద కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన తోలమైనది కుటుంబానికి నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా శనివారం 25 కేజీల సన్నబియ్యాన్ని నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నారెడ్డి మోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు రాజాగౌడ్, కాంగ్రెస్ నాయకులు రగోత్తంరెడ్డి, నాయిని నరసింహులు, కుమ్మరి శంకర్, ప్రసాద్, ఆంజనేయులు, రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న నారెడ్డి స్వచ్ఛంద సంస్థ

కుంభమేళాకు ప్రయాణం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో ప్రతిరోజు ప్రజలు కుంభమేళా వెళ్లే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరగుతోంది. శనివారం, ఆదివారం వాహనాలలో అధిక సంఖ్యలో గ్రూపులుగా ఏర్పడి, రైల్వేలలో, ప్రైవేట్ వాహనాలలో వెళుతున్నారు. 144 సంవత్సరాలకు వచ్చే కుంభమేళా కావడంవల్ల, గ్రామాలలో ప్రజలు అధ్యాత్మికతపై మొగ్గుచూపుతున్నారు.



కుంభమేళాకు బయలుదేరిన పలువురు

శుద్ధి జలం.. తాగితేనే ఆరోగ్యం

- ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ ప్రాంత ప్రజలు శుద్ధి జలానికి అలవాటు పడాలని ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ శాస్త్రవేత్త రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకులు డాక్టర్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని పైడి ఎల్లారెడ్డి ట్రస్ట్‌వారి ఆధ్వర్యంలో పోల్కంపేట్ గ్రామంలో నూతనంగా వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛమైన తాగునీరుకు అలవాటు పడితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కలుషిత నీటితో ప్రజలు రోగాల బారిన పడి వేల రూపాయలు ఆస్పత్రిలో పోగొట్టుకుంటున్నారన్నారు. గ్రామంలో శుద్ధి జలం ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులు శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయవాది మార్కండేయులు, గ్రామ తాజా మాజీ సర్పంచ్ పద్మా నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ రామానుజాచారి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, దివిటి రమేష్, బొందయ్య, యాదగిరి గ్రామస్తులున్నారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న పలువురు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్
- కామారెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ మహేష్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలో చైన్ స్నాచింగ్, ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్టు కామారెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ముఖ్యంగా అతివేగాన్ని, రోడ్డు ప్రమాదాలను నివారించే భాగంలోనే వాహనాలను సీజ్ చేస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో పలువురు యువకులు అతివేగంతో అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని పట్టుకునేందుకు నెంబర్ ప్లేట్ ఉంటే సిసి కెమెరాలు చూసి పట్టుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా బిగించుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు.



వాహన దారుడితో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ మహేష్

దళితుల జోలికొస్తే సహించేది లేదు

- దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్

నవతెలంగాణ-కామారెడ్డి(బిబిపేట్)



దళితుల జోలికొస్తే సహించేది లేదని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ అన్నారు. బిబిపేట్ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో ఓ దేవుని ఆలయంలో గ్రామంలోని కొందరు ఆలయ ఆవరణలో భజన చేస్తుండగా అక్కడ కొందరు మాల, మాదిగ వ్యక్తులు భక్తి పాటలు వాడుతుండగా అక్కడున్న అగ్రవర్ణానికి చెందిన ఒకరు మీరు తక్కువ కులం వారు కాబట్టి గుడిలోకి రావొద్దని అక్కడి నుంచి పంపించి వేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని నిర్ణయించి గ్రామంలోని అందరితో కలిసి భోజనం చేశారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తొద్దు

- ఎంపీడీవో నరేష్



మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-లింగంపేట్

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల అభివృద్ధి అధికారి నరేష్ గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని మోతే, నల్లమడుగు, నల్లమడుగు పెద్ద తండాల్లో తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. పైపులైన్లు లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. వారానికోసారి వాటర్ క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని నీటిని వృథా చేయకూడదని ఆయన అన్నారు. వాటర్ ట్యాంకులు చుట్టూ సమీపంలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈయన వెంట ఎంపీఓ మలహరి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ మున్సిపల్ చైర్మన్



వివాహ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి పట్టణం (4వ వార్డు) పోసానిపల్లి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మున్సిపల్ వాటర్‌మెన్ మొగులయ్య కుమార్తె వివాహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని (4వ వార్డు) పోసానిపల్లి గ్రామంలో ఘనంగా వివాహం నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సంతోష్, పోసానిపల్లి లింగం, గ్రామస్తులు తదితరులున్నారు.

నులి పురుగుల నిర్మూలన కోసం సర్వం సిద్ధం

- డాక్టర్ వినయ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 10న నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వం సిద్ధం చేసినట్టు డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక మానసిక అభివృద్ధి బలహీనపడుతుందన్నారు. మండలంలో ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు బాలురు 4111, బాలికలు 4929, మండలంలో మొత్తం 8340 మందిని గుర్తించినట్టు వివరించారు. వీరందరికీ ఈనెల 10న మాత్రలు పంపిణీ చేయడానికి వైద్య సిబ్బందిని సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కలిపే రవీందర్, శ్రావణ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, పిఆర్టియు మండలాధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కిషోర్ కుమార్, భూమాయప్ప, కూనేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వినయ్ కుమార్

10న విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-కామారెడ్డి

10న విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామ శివారులో గల 3/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో, విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు కామారెడ్డి రూరల్ ఏడిఈ, నరేష్, మాచారెడ్డి ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ పరిష్కార వేదికలో విద్యుత్ వినియోగదారుల, రైతులు, కన్స్యూమర్ల, సమస్యలను పరిష్కరించనున్నట్టు సూచించారు. పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ జిల్లా నుంచి ముఖ్య అతిథులుగా టీజీఎన్ పిడిసిఎల్ చైర్మన్ ఏరుకల నారాయణ, టెక్నికల్ మెంబర్ సలంద్ర రామకృష్ణ, ఫైనాన్స్‌మెంబర్ లకావత్ కిషన్, ఫోర్త్ నెంబర్ మద్రిపల్లి రాజగౌడ్‌లు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. ఈ పరిష్కార వేదికలో మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి, సదాశివనగర్, మండలాలకు చెందిన రైతులు, వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఈ సందర్భంగా, రైతులను, విద్యుత్ వినియోగదారులకు తెలిపారు.

యూనిసెఫ్ టీం రీసెర్చ్ ఆధ్వర్యంలో అవగాహన



అవగాహనలో పాల్గొన్న చిఆన్నారులు, యూనిసెఫ్ టీం రీసెర్చ్ సభ్యులు

నవతెలంగాణ-మద్నూర్

యూనిసెఫ్ టీం రీసెర్చ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని మూడు అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. అంగన్వాడీ సెంటర్లో 6 నుంచి 8 నెలల పిల్లల హెూమ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ను అందజేశారు. న్యూట్రిషన్ ఫుడ్ ఏ విధంగా ఇవ్వాలనేది కౌన్సెలింగ్ అందజేశారు. కార్యక్రమంలో మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సూపర్వైజర్, టీమ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో నిర్మాణమయ్యేనా..?



మార్కౌట్ చేస్తున్న అధికారులు (ఫైల్)

నవతెలంగాణ-తాడ్వాయి

ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం 45 రోజుల్లోగా పూర్తయ్యేనా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ మధ్య ఉన్న స్థలంలో హౌసింగ్, తహసీల్దార్, మండల పరిషత్ అధికారుల సమక్షంలో మార్కౌట్ చేశారు. వారం రోజులు గడిచినప్పటికీ మోడల్ హౌస్ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. నిర్మాణం పనులు 45 రోజుల్లో పూర్తి చేస్తామని హౌసింగ్ అధికారులు తెలిపినప్పటికీ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో వేచి చూడాల్సిందే.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయభాస్కర్

నవతెలంగాణ-రెంజల్

పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిలకు గురవుతూ అనేక ఇబ్బందులు పడుతూ ఉంటారని, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆర్‌బీఎస్‌కే డాక్టర్ విజయభాస్కర్ స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రక్తహీనతపై పరీక్షలు నిర్వహించి 80 మంది విద్యార్థులకు పరీక్ష చేశారు. కొంతమంది విద్యార్థులను పరీక్షించిన ఆయన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతూ సమయపాలనను పాటించకపోవడం వల్లే వారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. సమయానుకూలంగా పౌష్టికాహారాన్ని తీసుకుంటూ సమయం పాటించాలన్నారు. రాత్రులలో ఎక్కువ సమయాన్ని వృథా చేయవద్దని అన్నారు. చదివే కొద్దిసేపైనా మనసుపెట్టి చదువుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకురాలు శ్యామల, ఆరోగ్య కార్యకర్త మంజుల, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు శిల్ప, స్వప్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని గెలిపించాలి

- జిల్లా ఇంచార్జి పెద్దల గంగారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి పెద్దల గంగారెడ్డి

నవతెలంగాణ-తాడ్వాయి

ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన అంజిరెడ్డి గెలిపించుకోవాలని జిల్లా ఇన్చార్జి పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రపాడు రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులకు అండగా ఉండి ఆదుకునేది అంజిరెడ్డి అని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఇంచార్జి వేమారెడ్డి, రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి రవీందర్రావు, మండల అధ్యక్షులు వెల్మ సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, బూత్ సభ్యులు, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాపడిపూజకు విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని భోగేశ్వర ఆలయంలో సోమవారం శివ స్వాముల ఆధ్వర్యంలో జరిగే మహా పడిపూజ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు తూర్పు రాజులు రూ.5100 విరాళం శివ స్వాములకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం గురుస్వామి మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భోగేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలని మహా శివుని పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తూర్పు సంతోష్ కుమార్, కుమ్మరి శంకర్, శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు ఎమ్మెల్యే సహకారంతో బస్సు సౌకర్యం

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 9న ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమయ్యే భక్తుల పాదయాత్ర నసురుల్లాబాద్ సమీపంలోని శ్రీసాయిబాబా ఆలయం నెమలికి చేరుకుంటుంది. ఈ పాదయాత్రలో చిన్న పెద్ద మహిళలు పురుషులు తేడా లేకుండా వందల సంఖ్యలో పాల్గొననున్నారు. ఏడాదికేడాది పాదయాత్ర భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. మద్నూర్ నుంచి పాదయాత్రగా నెమలి గ్రామంలోని శ్రీ సాయిబాబా ఆలయానికి చేరుకొని దర్శించుకున్న అనంతరం తిరిగి వచ్చే భక్తులకు జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సహకారంతో బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పాదయాత్ర భక్తుల కోసం బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు శ్రీ సాయిబాబా పాదయాత్ర భక్తులు అభినందనలు తెలియజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం తెలంగాణ, మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆలయ సందర్శనలో పోటెత్తారు. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొందరు సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించి అన్నదానాలు చేపట్టారు.

సీఎం రేవంత్‌రెడ్డి, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం




చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న యువజన సంఘ సభ్యులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దశాబ్దాల కాలంగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ కృషి ఫలితంగా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి మండల మాదిగలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దబూరి గంగారం, నాయకులు గంద్యటం సాయిలు, అంబేద్కర్ సంఘం కార్యాలయ సభ్యులు, కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శిగా సురేష్

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత సంఘం ఆధ్వర్యంలో ఈనెల ఫిబ్రవరి 4, 5 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ కేంద్రంలో పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ శనివారం నిర్వహించారు. ఈ జనరల్ కౌన్సిల్లో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సురేష్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్టు సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల అసమాన త్యాగాల మీద ఏర్పడిన విద్యార్థి సంఘం తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చినందుకు విద్యారంగ సమస్యలపై ప్రజా సమస్యలపై కార్మిక సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ విధానం మార్చుకోకపోతే విద్యార్థులు అందరినీ చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-గాంధారి



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాన్సువాడలో నివాసముంటున్న షేక్ అహ్మద్ (32) తన సొంత గ్రామమైన గండివేట గ్రామానికి వచ్చి తిరిగి వెళుతుండగా గాంధారి మండలంలోని మొండిసడక్ గ్రామ శివారులో గ్రామం దాటిన తర్వాత షాదుల్లా ఉసేని దర్గా వద్ద వెనుక నుంచి వస్తున్న టాటా బెస్ట్ వెహికల్ టీఎస్ 28జి 4383 అనే వాహనం ఢీకొట్టడంతో షేక్ అహ్మద్ తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సమీనా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మహాధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ

నవతెలంగాణ-జుక్కల్



కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 10న ఇందిరా పార్క్ హైదరాబాద్‌లో జరిగే ప్రజా సంఘాల మహాధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి కార్మికులకు, రైతులకు, ఉపాధి హామీ కూలీలకు బడ్జెట్ పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్చ్ నెలలో తెలంగాణ ప్రభుత్వం పెట్టబోతున్న బడ్జెట్‌ను కార్మికులకు రైతులకు వ్యవసాయ కూలీలకు అనుకూల బడ్జెట్‌లో పెట్టాలని సురేష్ గొండ విజ్ఞప్తి చేశారు.

విత్తనోత్పత్తిదారులకు అవగాహన



నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండల కేంద్రంలోని విత్తన ధృవీకరణ కార్యాలయంలో, విత్తన, సేంద్రియ ధృవీకరణపై రైతులు విత్తనోత్పత్తిదారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ, రైతులకు వివిధ పంటల విత్తనోత్పత్తిలో పాటించవలసిన మెళకువలను వివరించడంతో పాటు, ధృవీకరించబడిన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడిని పొందాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన ధృవీకరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి ట్యాంకులను పరిశీలించిన అధికారులు



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మిషన్ భగీరథ అధికారులు, ఎంపీఓ శివ చరణ్‌తో కలిసి ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ గ్రామాల పరిధిలో గల మంచి నీటి ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ వేసవిలో మంచినీటి నీటి ఎద్దడి లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈలు స్వరాజ్, ఉదయ్ , పంచాయతీ కార్యదర్శులు జాకీర్, బోజన్న, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో తప్పిపోయిన నిర్మల్ జిల్లా వాసి

- కోటపాటిని ఆశ్రయించిన బాధితులు



వినతిపత్రాన్ని అందజేస్తున్న బాధితులు

నవతెలంగాణ-ఆర్మూర్

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాజూర గ్రామవాసి తిమ్మరాశి సాయినాథ్ దుబాయ్‌కి ఉపాధికై వెళ్ళిన నాలుగు రోజులకే తప్పిపోయాడు. దుబాయ్‌లోని జబ్లాలి ప్రాంతంలో ఒక కంపెనీలో చేరి మూడు రోజులు మాత్రమే పనిచేసి ఈ నెల 1 నుండి కనిపించడం లేదని సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శనివారం ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడును కలిశారు. ఈ సందర్భంగా సాయినాథ్‌ను వెతికి ఇంటికి రప్పించాల్సిందిగా వేడుకున్నారు. వెంటనే స్పందించి అక్కడి ఇండియన్ ఎంబసికి, ఎంఆర్‌డబ్ల్యుఎఫ్ దుబాయ్ శాఖ కోఆర్డినేటర్ జంగం బాలకిషన్‌కు సమాచారం పంపించి అక్కడి కార్యకర్తల సహాయంతో వెతికి పెట్టాల్సిందిగా కోరారు. బాలకిషన్ వెంటనే రంగంలోకి దిగి వెతుకుతున్నారు. ఇక్కడ ఉన్నప్పుడు గుల్ ఫారం కల్లు తాగే అలవాటు ఉన్న వ్యక్తులను గల్ఫ్‌కు పంపేముందు కొంతకాలం అలవాటు మాన్పించి నిర్ధారణ చేసుకొని మాత్రమే పంపే విధంగా ఏజెంట్లపై చర్యలు తీసుకొని ప్రభుత్వం నియంత్రించాల్సిందిగా కోటపాటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన మండల అధ్యక్షులు

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బాధిత లబ్ధిదారుల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్కు భూమేశ్వర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి చెక్కులు మంజూరు కావడంతో అందజేశామన్నారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సామ వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గద్దల రమేష్, ముఖీద్, ఏలేటి గంగాధర్, లింగపురం చిన్నయ్య, రాజేందర్, కన్నయ్య, హెూటల్ నర్సయ్య, పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పులెంటి పేరయ్య గత కొంత కాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిది నిరుపేద కుటుంబం వైద్యం చేయించుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు తెలియజేశారు. స్పందించిన ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

యాదగిరి జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శం



కామ్రేడ్ యాదగిరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ యాదగిరి సంతాప సభను పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్.ఆర్ భవన్, కోటగల్లీలో శనివారం నిర్వహించార. ఈ సంతాప సభకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న మాట్లాడుతూ.. ఆదర్శ కమ్యూనిస్టు, నిజాయితీ పరుడు, నిరాడంబరుడని అన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన కామ్రేడ్ యాదగిరి కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శమన్నారు. ఆయన మరణం పీడిత ప్రజలకు తీరని లోటన్నారు. అత్యంత త్యాగపూరిత జీవితం ఆయనదన్నారు. జీవితాంతం ఆదర్శంగా నిలిచి, మరణించిన తర్వాత కూడా తమ శరీరాన్ని, నేత్రాలను దానంచేశారన్నారు. కామ్రేడ్ యాదగిరన్న నిజామాబాద్ జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ఆయన ఆశయాల సాధనలో చైతన్య స్ఫూర్తిగా ప్రజా ఉద్యమాల నిర్మించాలన్నారు. కామ్రేడ్ యాదగిరి అన్నకు నిజమైన నివాళి అని అన్నారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి సాయన్న, సీఎల్సీ జిల్లా కార్యదర్శి అల్గోట్ రవీందర్, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, పార్టీ జిల్లా నాయకులు మురళి, నగర నాయకులు బీక్ సింగ్, విఠల్, లక్ష్మీ, లింగం, సాయిబాబా, గంగాధర్, రవి, నర్సక్క, సునందక్క, మహిపాల్, గంగన్న వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే పనులు

- లేదంటే రైతులకు తప్పని తంటాలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలోని రైతులు, ప్రజలు తమ సమస్యపై వెళితే డబ్బులిస్తేనే ఫైల్ ముందుకు సాగుతుందిజ లేదంటే అక్కడి అధికారితో తిప్పలు తప్పడం లేదని కొందరు రైతులు వాపోతున్నారు. ఏ చిన్నపనికి వెళ్లిన వివిధ కారణాలతో పనులు జరగడం లేదని, అదే డబ్బులిస్తే పనులు వేగంగా పూర్తవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ ఇంటికి మీటర్ కావాలని కొందరు డిడిలు కట్టిన వారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదని కన్యూమర్లు వాపోతున్నారు. ఇలా ఎందుకని ప్రశ్నిస్తే మీఇంటికి స్తంభం దూరంగా ఉందని, స్తంభాలు వెయ్యాలనే సాకు చెప్పి మీటర్‌ను రిజెక్టు చేయించారని రైతు వాపోయాడు. డబ్బులు కట్టి సుమారు రెండు నెలలు గడిచిన ఇంతవరకు మీటర్ బిగించక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలకు సైతం లైన్మెన్ మ్యాపు ఇచ్చిన సబ్ ఇంజనీర్ ఇంతవరకు ఎస్టిమేషన్ వెయ్యక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుల వసూలుకు సబ్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. డబ్బులు అడిగేది లేదు పనులు చేసేది లేదు.. తిరిగి తిరిగి వేసారి అప్పుడు డబ్బులు ఖర్చు ఐతే ఏమైనా చెల్లించుకుంటామని వినియోగదారుల నోటితో అనే వచ్చేవరకు ఇబ్బందులకు గురి చేస్తాడని అంటున్నారు. డబ్బుల ఇద్దామని వారి నోట వచ్చిందా..

అంతే, అప్పుడు తాను ఏర్పాటు చేసుకున్న వ్యక్తితో మాట్లాడమని పంపించేస్తాడని, సదరు ఆరెండవ వ్యక్తికి వారు చెప్పింది ముట్ట చెపితే పనులు చకచకా అవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీతానికి మూడు వంతులు అధికంగా సంపాదన కూడగట్టుకుంటున్నట్లు కొందరు రైతులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటివి జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారు చేపూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి క్షత్రియ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం సెమినార్‌హాల్‌లో అత్యంత ఉత్సాహంగా జరగగా, ముఖ్య అతిథులుగా డాక్టర్ శంకర్ ఛటర్జి, డాక్టర్ గరిగిపాటి శ్రీనివాసు, రామ సావిత్రి డబ్బేరు, సౌమిత్రి లక్ష్మణాచార్య, తదితరులు పాల్గొన్నారు. క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు కళాశాల వెన్నెముక లాంటివారని, కళాశాల భవిష్యత్తు, ప్రత్యేకతలు, పేరు ప్రతిష్ట అన్నీ వారి పనితీరుపై ఆధారపడి ఉంటాయన్నారు. గత సంవత్సరం, అనేక మంది విద్యార్థులు క్షత్రియ కళాశాల నుంచి విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడినందుకు గర్వంగా ఉందన్నారు. వారు సంస్థకు మంచి పేరు తెచ్చారని అభిప్రాయపడ్డారని అన్నారు.

ముఖ్య అతిథి డాక్టర్ శంకర్ ఛటర్జి మాట్లాడుతూ.. ఐఐటి, ఐఐఎం అమెరికా యూనివర్సిటీలతో పాటు, అనేక అంతర్జాతీయ సంస్థల్లో క్షత్రియ పూర్వవిద్యార్థులు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ స్ఫూర్తితో, వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకొని, అక్కడి ప్రజల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. తద్వారా కళాశాలకు గొప్ప పేరు తెచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్కె. పాండే మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని, పూర్వ విద్యార్థులు, కళాశాల మధ్య ఒక మైత్రి వంతెనను నిర్మించడమే మా లక్ష్యం అన్నారు. ఈ సమ్మేళనాలు విద్యార్థుల సహకారాన్ని పెంచి, వారి అభ్యున్నతికి తోడ్పడతాయని తెలిపారు. పూర్వ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల యజమాన్యం, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామికి వెండి కిరిటాలు

నవతెలంగాణ-కామారెడ్డి(మాచారెడ్డి)

శ్రీ లక్ష్మీనరసింహస్వామి గ్రామ దేవాలయంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి మూలమూర్తులకు కీర్తిశేషులు పాత కిష్టయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పాత లక్ష్మీరాజం, పండరి, రమేష్, అశోక్ కుటుంబ సభ్యులందరూ కలిపి సుమారు కిలో వెండితో స్వామివారికి అమ్మవారికి రెండు వెండి కిరీటాలు తయారు చేయించి పూజా కార్యక్రమాలు చేయించి ఆలయాధికారులకు అందజేశారు. విగ్రహ మూర్తులకు వెండి కిరిటాలు చేయించిన దాతలను ఆలయం తరపున సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆలయ అర్చకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఎస్సీ (ఏబిసి) వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహం ముందు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అతి ఉత్సాహంతో అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల మాదిగలను విడదీసిన ఈ చేతగాని ముఖ్యమంత్రి అన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక బస్టాండ్ దగ్గర గల ఆదర్శ హిందీ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం, హిందీ మీడియం పదవ తరగతి విద్యార్థులపై పబ్లిక్ ఎగ్జామ్స్ రిత్యా పరీక్ష పే చర్చ సారాంశంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు క్లబ్ ఇన్చార్జి అధ్యక్షుడు జి.రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ మాజీ అధ్యక్షులు రాజ్ కుమార్ సుబేదార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశనుండే జీవితంలో స్థిరపడాలనే లక్ష్యాలను ఏర్పరచుకొని దానికి తగిన విధంగా దశాదిశలను అధ్యాపకుల నుంచి నేర్చుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్ గంగారెడ్డి, శ్రీరాంసోని, శ్రీకాంత్ జవహర్, డాక్టర్ కొండ అమర్నాథ్, జుగల్ సోనీ, సుధీర్ గుప్తా, పాఠశాల హెచ్ఎం ఆనంద్ ఉపాధ్యాయ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకు మూలం పుస్తకాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాగారంలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో జువాలజీ, కెమిస్ట్రీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్‌తో వెబినార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. విద్యార్థుల ఉద్దేశించి యువత జ్ఞాన సమర్థనకు మూలం పుస్తకాలు అని, ఉన్నత స్థానాలను సంపాదించి అభివృద్ధి చెందాలంటే దానికి ఆధారం గ్రంథాలయమని, పుస్తకాలను ప్రతిరోజు చదవడం, రాయడం మొదలైన అభ్యసన ద్వారా వారి భవిష్యత్తుకి ప్రణాళికలను వేసుకోవచ్చు అన్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు సమాధానం చెప్పారు. వెబినార్ కార్య నిర్వాహకులు కెమిస్ట్రీ విభాగాధిపతులు రమ్య, నవత, హీనా, జువాలజీ విభాగాధిపతులు సుమాంజలి, ప్రనూష, ప్రిన్సిపాల్ సైదా జైనబ్, వైస్ ప్రిన్సిపల్ వి.జి.లక్ష్మి విద్యార్థులు, అధ్యాపకులు మౌనిక, ప్రియాంక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గల బర్దిపూర్ శివారు ప్రాంతంలో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఉదయం 6 గంటలకు చోటుచేసుకుంది. నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ ఇచ్చిన సమాచారం ప్రకారం కే యం నంబర్ 467-7, 467-8 వద్ద ఒక గుర్తు తెలియని (30) గల పురుషుడు ఆత్మహత్య చేసుకోవాలనే ఉదేశ్యంతో రైలు పట్టలపై పడుకోగా తిరుపతి నుంచి అకోలా వెళ్తున్న రైలు అతనిపై వెళ్లడంతో కలిగిన గాయలతో అక్కడిక్కకడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి మృతదేహం వద్ద ఏలాంటి ఆధారాలు లభించలేదు. ఇట్టి విషయమై కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడు గూర్చి ఎలాంటి సమాచారం తెలిసిన రైల్వే ఎస్సై సాయిరెడ్డి 8712658591కి సమాచారం అందించాలని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భారీ ర్యాలీ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఫాం తీసుకున్న తర్వాత పట్టణ కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆర్మూర్లో ర్యాలీ కొనసాగడం శుభసూచకమని అన్నారు. పట్టభద్రుల సమ్మేళనం అద్భుతంగా జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ గెలుపు ఒక బహుమతి కావాలని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రభుత్వం బలోపేతం చేసిందని, ఈ సోమవారం 10న నామినేషన్ కార్యక్రమానికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు సైతం హాజరవుతున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార చంద్రమోహన్, అయ్యప్ప శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో ఎంతోమంది ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌లో ఒకరు అనుమానాస్పద మృతి

- కేసు నమోదు



పంచనామా చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకా పూర్ గ్రామంలో సంపంగి నర్సయ్య (41) ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.సత్య నారాయణ శనివారం తెలిపారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.. మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామ మహిళా సంఘాలకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న మండల సమైక్య కోఆర్డినేటర్ భాజన్న

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని సికింద్రాపూర్ మహిళా గ్రామ సంఘంలో గ్రామ సంఘం ఉప విధులు నిబంధనావళిపైన ఐకెపి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. చట్టబద్ధ సంస్థ, పరంపర అధికారం సహకార సూత్రాలకు నిర్వచనం తదితర అంశాలపైన మండల సమైక్య కోఆర్డినేటర్ భాజన్న శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళా సంఘ సభ్యులందరికీ గ్రామ మహిళా సహకార సంఘం లక్షణాల, విధులు, సభ్యత్వం, గ్రామ సంఘ వ్యవహారాలు, సభ్యులు ఆర్థిక బాధ్యత, మహాసభ, పాలకవర్గం పదాధికారులు, గ్రామ సంఘం సిబ్బంది శిక్షణలు, వాటాధనం, గ్రామ సంఘం గరిష్ట రుణ పరిమితి నిధుల సేకరణ గురించి వివరించారు. మిగులు లోటు నిర్వహణ ఆడిటింగ్, ఆర్థిక లెక్కల సంవత్సరం, తదితరాలు ఫైలు చేయుట, లెక్కలు, రికార్డులు, వివాదాల పరిష్కారం, సలహా వర్గం, కమిటీలు, వ్యాపార పరిపాలన నియమావళి, బ్యాంకు లావాదేవీలు ఉపవిధుల సవరణ, చట్టంలోని పద్ధతులు వర్తింపు గురించి తెలిపారు. ఇతర డిపాజిట్లు, లావాదేవీలు, చిక్కుల తొలగింపు, సంఘ మూసివేత రద్దు, ఆదాయపు పన్ను నిబంధనపైన కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న పూర్తిగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘ ప్రతినిధులు, చిన్న సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, వివోఏ, తదితరులు ఉన్నారు.

బాక్సింగ్‌లో సత్తా చాటిన కంజర గురుకుల విద్యార్థి



విద్యార్థినిని సన్మానించిన పాఠశాల బృందం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర శివారులోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.సిరివల్లి బాక్సింగ్ అకాడమీకి ఎంపికై వరంగల్, ఆదిలాబాద్, షేక్‌పేట్‌లలో రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు సార్లు బంగారు పతకం, రంగారెడ్డిలో రాష్ట్రస్థాయి పోటీలో కాంస్య పతకం సాధించింది. నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ డిస్ట్రిక్ మీట్‌లో రెండు సార్లు పాల్గొని, ఢిల్లీ ఎస్‌జీఎఫ్‌కు ఎంపికై జాతీయ స్థాయి పోటీలో పాల్గొనడం పాఠశాలకే కాకుండా జిల్లాకే గర్వకారణంగా నిలించిందని కళాశాల ప్రిన్సిపాల్ జి.విజయ లలిత విద్యార్థిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాల విద్యార్థులకు సిరివల్లి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థినిని సత్కరించారు. కార్యక్రమంలో పీడి ఉదయశీల, ఎస్‌విపి వినోద, జెవిపి సునీత, పిఈటీలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి ఉత్సవం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని అర్సపల్లి మత్స్యశాఖ ఎఫ్‌డిఓ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా గంగపుత్ర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా భీష్మ ఏకాదశి ఉత్సవాన్ని గంగ పుత్రులు శనివారం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల మండలాల అధ్యక్ష, కార్యదర్శులు గంగపుత్రులు జిల్లా స్థాయిలో భీష్మ ఏకాదశి ఉత్సవాన్ని జరుపుకున్నారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మన జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు, ఎఫ్‌డిఓ జిల్లా గంగపుత్ర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తుంగిని సాయిలు, లీగల్ అడ్వైజర్ రవి, ప్రధాన కార్యదర్శి బాలగంగాధర్, ఉపాధ్యక్షులు మీసాల రవి, ప్రచార కార్యదర్శులు ఎల్‌ఐసీ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ మంగల్పాటి లింగం, గౌరవ అధ్యక్షులు కమ్మర్పల్లి బాలన్న, పల్లికొండ నర్సన్న, ముఖ్య సలహాదారులు రెంజల్ ప్రెసిడెంట్ శంకర్, రమడోల్ల పోతన్న, ప్రమోటర్ సురకత్తుల పెద్దన్న, డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, సంయుక్త కార్యదర్శి మద్ది రాజు, నవీపేట మండల ప్రెసిడెంట్ చెట్టుకింద నారాయణ, వివిధ గ్రామాల నుండి వచ్చిన గంగపుత్ర సంఘాలు పాల్గొన్నారు.

దళితుడినని అవమానించారని పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

నవతెలంగాణ-తాడ్వాయి

ఆలయంలోకి వెళ్తే తనను దళితుడినని అవమానించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి ఆలయంలో చోటుచేసుకుంది. కాగా ఈ ఘటన శనివారంలోకి వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలో మల్లికార్జున ఆలయాన్ని నిర్మించారు. అందులో భాగంగా గురువారం నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే శుక్రవారం నిర్వహించిన భజన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కూరెల్ల రమేష్ అనే దళిత వ్యక్తి పాల్గొన్నాడు. 'రమేష్ నీవు ఆలయంలోకి వచ్చావు. అగ్గి లాంటి దేవుడు. నీవు, మేము క్షేమంగా ఉండాలి.' అని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనడంతో కలత చెందిన బాధితుడు పోలీసులకు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ గ్రామాన్ని సందర్శించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యాదగిరన్న స్ఫూర్తితో విప్లవోద్యమాలను నిర్మిద్దాం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మోర్తాడ్ మండల కేంద్రంలో మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ యాదగిరి సంస్మరణ సభనునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్. యాదగిరి అన్న జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణంకు పునాదులు వేసిన మూల స్థంభంలాంటి వారని మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం అన్నారు. మోర్తాడ్ సిరికొండ మండలాలతో పాటు భీంగల్ పాత తాలూకాలో పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా బలమైన విప్లవ పోరాటాలను నిర్మించిన కమ్యూనిస్ట్ యోధుడు అన్నారు. కులావివక్షతకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణంకు కృషి చేసాడని ఆయనను స్మరించుకోవడం అంటే విప్లవ పోరాటాలను నిర్మించాడమే అన్నారు. ఆయన పోరాట వారసత్వాన్ని కొనసాంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మాస్ లైన్ మోర్తాడ్ మండల కార్యదర్శి కిషన్ అధ్యక్షత వహించగ జిల్లా నాయకులు సురేష్, సత్తెమ్మ, డివిజన్ నాయకులు కిషన్, అశోక్, ప్రజాసంఘాల నాయకులు దయల్ సింగ్, దశరత్, పద్మ, రాజన్న, నర్సయ్య, అంజలి, లక్ష్మి రాధాక్క, జమున, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెటే రక్షణ కవచం

- హెల్మెట్ లేని కారణంగా 50 శాతానికిపైగా ప్రమాదాలు
- అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం శూన్యం
- ప్రమాదాలు తగ్గాలంటే ప్రజల్లో మార్పు రావాలి
- నిజామాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సహాయ కమిషనర్) నారాయణ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో హెల్మెట్ ధరించకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనాల ద్వారా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 2024లో 858 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదు కాగా 341 మంది మృతి చెందారని, 793 మందికి గాయాలైనట్లు 2024 డిసెంబర్లో 74 రోడ్డు ప్రమాదాల్లో 27 మంది మృతి చెందగా కేవలం జనవరి ఒక్క నెలలోనే 77 రోడ్డు ప్రమాదాలు జరగగా 41 మంది మృతి చెందారని నిజామాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ నవతెలంగాణతో తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని

నిజామాబాద్ జిల్లాలోని ట్రాఫిక్ పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టిన కొంతమంది ద్విచక్రవాహనదారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

హెల్మెట్ ధరించకుండా రోడ్లపైకి వచ్చేస్తున్నారని, ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్న పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా వాహనదారుల ప్రవర్తనలో మాత్రం మార్పు రావడం లేదన్నారు. చివరకు హెల్మెట్ లేదని చలానా రాసినా కట్టడానికి సిద్ధంగా ఉన్నారే తప్ప కనీసం తమ బాధ్యతగా హెల్మెట్ పెట్టుకుందామనే ఆలోచన లేదని, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రమాదం జరిగాక హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలు దక్కేవే అనే మాటలు మాట్లాడుకోవడం ఇప్పుడు మాములై పోయిందన్నారు.. ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వ్యక్తులు ఎక్కువగానే ఉంటున్నారని తెలిపారు. మృతి చెందిన వారిలో సైతం హెల్మెట్ ధరించని వారు ఎక్కువగా ఉంటున్నారని, 55 నుండి 60 శాతం మంది నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు మండలాల పరిధిలోని వాహనాదారులు హెల్మెట్ ధరించడం లేదని, హెల్మెట్ ధరించాలని

గతంలో ఎన్ని నిబంధనలను అమలు చేసిన నో హెల్మెట్, నో పెట్రోల్, నిబంధనను అమలు చేసినా మూనాళ్ల ముచ్చటగానే ముగిసిపోయిందన్నారు. హెల్మెట్ వినియోగంపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు కూడా దృష్టి సారించకపోవడంతో వాహనదారుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఒకటికి రెండు సార్లు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టినా పెద్దగా మార్పు కనిపించడంలేదని అన్నారు.

జిల్లా కేంద్రంలో తరచు జరుగుతున్న ప్రయాణాల్లో యువతే అధికంగా ఉండటం గమనార్హమని తెలిపారు. రహదారి నిబంధనలను ఉల్లంఘిస్తూ ద్విచక్రవాహదారులే అధికంగా ప్రాణాల మీదకు తెచ్చుకుంటుండగా మరికొందరు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారని అన్నారు. మార్కెట్లోకి కొత్త వాహనం రాగానే వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేయడానికి యువత ఆసక్తి చూపుతున్నారని, కానీ డ్రైవింగ్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడాన్ని మాత్రం మర్చిపోతున్నారని తెలిపారు. కొందరు ప్లేట్లపై బండి నెంబర్లను తొలగించడం, వివిధ రకాల స్టిక్కర్లు అతికించడం, అక్షరాలు కన్పించకుండా వేస్తూ అతి వేగంగా వెళ్తున్నారని తెలిపారు. వాహనం ఎవరిది, ప్రమాదం ఎవరు చేశారో తెలియకపోతుండటంతో బాధితుడికి బీమా పరిహారం కూడా రావడం లేదని, పోలీసుల తనిఖీల్లో వాహనాల నెంబర్ ప్లేట్లను మార్చిన వారు పట్టుబడుతూ కేసులను ఎదుర్కొంటున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం వాహనం నడిపే వాహనదారుడి వద్ద లైసెన్స్, వాహనం యొక్క ఆర్సి పేపర్లు, ప్రమాద బీమా, కాలుష్య నియంత్రణ పత్రాలు, హెల్మెట్ తప్పనిసరని తెలిపారు.

యువత ఎక్కువగా వాహన ప్రమాదాలకు గురవుతుండటం, వారి నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోతుండటంతో ట్రాఫిక్ పోలీసుశాఖ గతంలో జరిగిన సంబంధిత శాఖ అధికారుల సమావేశంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారని అన్నారు. చాలా మంది ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో హెల్మెట్ వెంట తెచ్చుకుంటున్నారు కానీ వాటిని బండికి తగిలించుకొని వెళు న్నారని, పోలీసులు తనిఖీలు చేస్తున్నారని తెలిస్తేనే ధరిస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం వేదన వర్ణనాతీతంఅని, ద్విచక్ర వాహనం నడిపే వారు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాదం జరిగిన సమయంలో పాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. జుట్టు ఊడిపోతుందని, ముఖం పాలిపోతుందని అనుకుని హెల్మెట్ ధరించడం మానేస్తున్నారని అన్నారు.

ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ



రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి అనేక మంది వారి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించిచాలి. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారు. చాలా మందికి బ్రెయిన్ డామేజ్ అయ్యి కోమాలోకి వెళ్లడం, పెరలాసిస్ కు గురికావడం వంటి ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని, వాటి వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవర్చని కావున ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు.

రక్షణ కోసం హెల్మెట్ ధరించండి

ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్



హెల్మెట్, సీటు బెల్ట్ అన్నది స్వీయ రక్షణ కోసం అనే విషయాన్ని ముందుగా వాహనదారులు గుర్తించాలని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వాహనదారులకు సూచించారు. దీనివల్ల తలకు పూర్తిరక్షణ లభిస్తుంది. ప్రమాదం జరిగిన సమయంలో స్వల్ప గాయాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈవిషయమై దాహనదారులకు అవగాహన కల్పించాం. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. మండలంలో జరుగుతున్న ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదార సంఖ్య అధికంగా ఉన్నందున, హెల్మెట్ వినియోగం తప్పని సరిగా ఉండాలి. లేనిపక్షంలో హెల్మెట్ ధరించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం అధ్యక్షులు నామాల లింబాద్రి ఆధ్వర్యంలో సంఘం భవనంలో శనివారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని జెండా ఆవిష్కరించి, భీష్ముని చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. నలుగురికి తీవ్ర గాయాలు



కారు చెట్టును ఢీకొన్న ప్రదేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం-బి గ్రామ శివారులో రాహదరి పక్కన ఉన్న చెట్టును కారు డీ కోన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ హెచ్ ఓ మోహమ్మద్ షరీఫ్ తెలిపారు.అయున తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నగరంలోని ఆర్య నగర్ కు చెందిన జగన్, గణేష్, నరేష్, రమేష్ కలిసి శనివారం కరీంనగర్‌లో ఒక ఫంక్షన్ కు హాజరై తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని ధర్మారం-బి గ్రామ శివారులోని పిహెచ్ ఆర్ ఫంక్షన్ హాల్‌కు కొద్ది దూరం దాటిన తర్వాత గల మలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెట్టును ఢీకొంది. దాంతో కారులో గల వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు ఆయన వివరించారు. జగన్ చెల్లెలు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి గాయాలపాలైన వారికి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి

- డిఎంహెచ్ఓ రాజశ్రీ
- మందుల నిల్వలు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్



మందల నిల్వలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ నగరంలోని సీతారాం నగర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ రాజశ్రీ మాట్లాడుతూ.. సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదగా ఉండాలని అన్నారు. ఆరోగ్య కేంద్రంలోని మందులు నిల్వను, టీకాలు నిల్వచేసే ఫ్రిజ్‌ను ల్యాబ్ ను, పరిశీలించారు. ఫార్మసిస్టులు ముఖ్యంగా మందుల నిల్వను ఉండేలా చూస్తూ టీకాలు నిల్వచేసే ఫ్రిజ్‌లో టెంపరేచర్‌ని రోజూ రికార్డు చేయాలని అన్నారు. ఎన్సీడీ స్క్రీనింగ్, ఎంసిహెచ్, ప్రతిరోజు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారి అన్నిజాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ అన్ని పారామీటర్స్ లో ముందుండాలని తెలియజేశారు, అదేవిధంగా స్థానిక సిబ్బందికి పరిసరాల శుభ్రతపై, ఆసుపత్రిలో శుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య, ఫార్మసిస్టు సూపర్వైజర్ నారాయణ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఉన్నారు.

సిద్దాపూర్ తండాలో చోరీ

రెండు మాసాల కమ్మలు ఎత్తుకెళ్లిన దుండగులు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని సిద్దాపూర్ తాండ లో శుక్రవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో చోరీ జరిగింది. ఎస్సై రాజ కథనం ప్రకారం సిద్దాపూర్ తాండకు చెందిన కేతావత్ కవిత, గోపాల్ తమ కూతురు క్రాంతిక తో కలిసి ఇంటి ముందర నిద్రిస్తున్నారు. ముగ్గురు దుండగులు వచ్చి వారిని బెదిరించి కవిత చెవులకు ఉన్న రెండు మాసాల కమ్మలను తీసుకొని పారిపోయారు. బాధితురాలు కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులపైనే ఉంది

- మోటివేషన్ స్పీకర్ శ్రీహరి



నవతెలంగాణ-లింగంపేట్

పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల పైనే ఆధారపడి ఉందని మోటివేషన్ స్పీకర్ శ్రీహరి తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆర్యే పబ్లిక్ స్కూల్లో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించడం కాకుండా రోజువారి ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండేలా విద్యార్థులకు విలువైన సూచనలను ఇవ్వాలన్నారు. గ్రామీణ మారుమూల ప్రాంతాలకు చెందిన మాలోతు పూర్ణ ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిందని దేశానికి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పిల్లలను సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంచాలని, తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల మనవడిగా తల్లిదండ్రుల పైనే ఆధారపడి ఉందని ఆయన అన్నారు. అనంతరం తల్లిదండ్రులకు పిల్లలు పాదాలు కడిగారు. క్రమశిక్షణకు మారుపేరని తల్లిదండ్రులను గౌరవించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళరాంపూర్‌లో మొసలి పట్టివేత

- ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఏర్గట్ల



పట్టుకున్న మొసలి

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో శనివారం ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకోవడంతో ఒక్కసారిగా గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో కూడా ఒకసారి మొసలి గ్రామస్థులకు చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది. తాళ్ళ రాంపూర్ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 3 గంటల సమయంలో టిఫిన్ సెంటర్ యజమాని బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ పాఠశాల దగ్గర మొసలిని చూసి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. 100 కు డయల్ చేశామని, ఏర్గట్ల పోలీస్ బృందం మొసలి ఉన్న ప్రాంతానికి చేరుకుంది. కమ్మర్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కమ్మర్ పెల్లి రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ రవీందర్ ఆయన బృందంతో అక్కడికి చేరుకుని, నిజామాబాద్ నుండి రెస్క్యూ టీమ్(మొసలి పట్టే వారిని) రప్పించి సుమారు గంటన్నర పాటు శ్రమించి మొసలిని పట్టుకున్నట్లు తెలిపారు. ఇదే విషయమై నవతెలంగాణ కమ్మర్‌పెల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవీంధర్ ను వివరణ కోరగా... పట్టుకున్న మొసలిని పైఅధికారుల సూచనల మేరకు ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్‌లో వదిలిపెట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఏ.వి.సురేష్, బీట్ ఆఫీసర్ వరుణ్, పోలీస్ బృందం పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను పటిష్టపరచాలి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవతెలంగాణ-బోధన్



పూర్వవిద్యార్థులను సన్మానిస్తున్న పలువురు

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ప్రాథమిక విద్యను పటిష్టపరచాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణగా మెలగడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇంటర్నెట్ వినియోగంలో కూడా సెల్‌ఫోన్‌ల వాడకాన్ని విద్యార్థులు మంచి కోసం ఉపయోగించాలని సూచించారు. అంతేకానీ సెల్‌ఫోన్‌లే లోకం కావొద్దని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా గమనించాలని, దుర్వ్యసనాలకు బానిస కాకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, రాంపూర్ సాయి కళాబందం వారిచే నిర్వహించిన ఆటపాట కార్యక్రమం అలరించింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతోను, ఏసీపీ శ్రీనివాస్‌ను ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంబీబీఎస్ సీటు సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల ఎంఈఓ మంజుష, బోధన్ మండల ఎంఈఓ నాగయ్య, ఏసిపి శ్రీనివాస్, సాలూర మండల తహశీల్దార్ శశిభూషణ్, పిఆర్టియు ముఖ్య నాయకులు ఇల్తెపు శంకర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్, ప్రైవేట్ విద్యాసంస్థల అధ్యక్షులు హరికష్ణ, ప్రజ్ఞశ్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ లత-రాజు, వివిధ గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శనివారం స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపును నిర్వహించారు. ఈనెల 12న పోతులూరి వీరబ్రహ్మేంద్ర జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజైన శనివారం విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంనుండి శ్రీగిరి క్షేత్రంపై ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకు భాజా భజంత్రీల మధ్య మహిళలు మంగళం హారతులతో ముందునడువగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మూర్తులను శ్రీగిరి క్షేత్రం పైకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి మాట్లాడుతూ.. శ్రీగిరి క్షేత్రంపైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద యజ్ఞాలు, హెూమాలు ఐదురోజుల క్రతువు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భోగ రామస్వామి, ఉపాధ్యక్షుడు శివసారం గణేష్, సెక్రటరీ జైడి బాలకృష్ణ, క్యాషియర్ నూకల బుచ్చి మల్లయ్య, సభ్యులు గంగాధర్, శ్రీకాంత్, సామ కపిల్, సుంకట శ్రీనివాస్, సోంపేట అశోక్, గంగాధర్, సత్యపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గెలుపుతో విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్:పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం బిజెపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీలో పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : 27 సంవత్సరాల తర్వాత దేశ రాజధాని న్యూ ఢిల్లీలో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి రావడం పట్ల శనివారం ముప్కాల్ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ నుంచి శివాజీ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టి టపకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం బీజేపీ అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ అప్ పార్టీ 12 యేండ్ల పాటు అధికారంలో ఉంటూ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీలేదని అన్నారు. అప్ నేత కేజ్రీవాల్ లిక్కర్ స్కామ్, వాటర్ స్కామ్, అవినీతి కేసుల్లో చేసిన మోసాలకు ఢిల్లీ రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి, నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

బాల్కొండ : ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలలో భారతీయ జనతా పార్టీ అత్యధిక సీట్లు సాధించి, విజయం సాధించిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు అంబటి నవీన్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు అంబటి నవీన్ మాట్లాడుతూ ఆప్ పార్టీ అవినీతి, స్కామ్‌ల పాలన తో విసిగిపోయిన ఢిల్లీ ప్రజలు భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టారాన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆప్ పార్టీ బీజేపీపై ఎన్నో దుష్ప్రచారాలు చేసిన ప్రజలు నమ్మలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నక్కల గణేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ డైరెక్టర్ ఆరెపల్లి నర్సయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు జక్కం శ్రీకాంత్, ఐటీ సెల్ మండల కన్వీనర్ కొత్తింటి రాకేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్:ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో శనివారం మధ్యప్రదేశ్‌లో ఎన్‌హెచ్ 52 హైవే మీద మద్నూర్ నాయకులు మాట్లాడుతూ.. ఢిల్లీలో దేశంలో మోడీ పరిపాలనను గమనించిన ప్రజలు బీజేపీకి విజయడంకా మోగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు తెప్పవార్ తుకారాం, జిల్లా సెక్రటరీ కృష్ణ పటేల్, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ తులవార్ సంతోష్, శ్రీపద్ పటేల్, లూటే ప్రవీణ్ పాటిల్, గంగాధర్ బండివార్, ప్రవీణ్, గోవింద్, రాజ్ గడిగే శ్రీనివాస్, గాలప్ప తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : ఢిల్లీ గడ్డపై భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించినందున నాగిరెడ్డిపేట్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మండల్ అధ్యక్షులు హనుమాన్లు, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజాగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రాజు, శ్రీకాంత్‌తో పాటు సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.